సాక్షి ఖమ్మం

శుక్రవారం । 30 । మే । 2025



‘రియల్’ దందా

సత్తుపల్లి మున్సిపాలిటీ, మండలంలో పలువురు అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. 8లో



మహిళలే అంబాసిడర్లు..

మహిళలు రూపొందించే ఉత్పత్తులకు వారే అంబాసిడర్లుగా వ్యవహరించాలని ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, సాయంత్రం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదవుతుంది.

రైతులకు అండగా ‘సాక్షి’

నేడు డీఏఓ, శాస్త్రవేత్తలతో ఫోన్ ఇన్



ధనసరి పుల్లయ్య

సాక్షి ఫోన్ ఇన్

ఖమ్మంవ్యవసాయం: నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు మొదలయ్యాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే, దుక్కులు దున్నడంలో జాగ్రత్తలు, మేలైన విత్తనాల ఎంపిక, నకిలీల బారిన పడకుండా కాపాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కోసం రైతులకు ‘సాక్షి’ అండగా నిలవనుంది. రైతులు తమ సందేహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం నేరుగా జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, కేవీకే శాస్త్రవేత్తలతో మాట్లాడేలా ‘ఫోన్ ఇన్’ నిర్వహిస్తోంది. ఈమేరకు అన్నదాతలు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

తేదీ : 30-05-2025, శుక్రవారం (నేడు)
సమయం : ఉదయం 9నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్
89777 47500

న్యూస్‌రీల్

ఐటీ హబ్‌లో 2నుంచి నైపుణ్య శిక్షణ

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని ఐటీ హబ్‌లో వచ్చే నెల 2వ తేదీ నుంచి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యాన నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో కోరారు. జావా ఫండమెంటల్, జావా ప్రోగ్రామింగ్, పైథాన్ డేటాబేస్, క్లౌడ్ కంప్యూటింగ్, టాలీ జీఎస్టీ, ఐటీ స్కిల్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇందుకోసం రూ.599 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే ఆరు నెలల వ్యవధిలో అభ్యర్థులకు అనుకూలమైన సమయంలో శిక్షణకు హాజరుకావొచ్చని వెల్లడించారు. పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 95025 05880 నంబర్‌లో సంప్రదించాలని వారు ఓ ప్రకటనలో సూచించారు.

నూరు శాతం వ్యాక్సినేషన్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని చిన్నారులకు నూరు శాతం వ్యాక్సినేషన్ నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి ఆదేశించారు. ఖమ్మంలో గురువారం మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలకు రోటా వైరస్, ఇతర వ్యాక్సిన్లపై ఏర్పాటుచేసిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 97శాతం వ్యాక్సినేషన్ పూర్తయినందున, 100 శాతానికి సిద్ధం కావాలని తెలిపారు. ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు సంయుక్తంగా తల్లిదండ్రులను కలిసి ఎనిమిది ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించేలా వేస్తున్న వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించడంతో పాటు వారిలో అపోహలు తొలగించాలని సూచించారు. అంతేకాకుండా అన్ని వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చందునాయక్, డబ్ల్యూహెచ్‌ఓ శిక్షకులు మురహరి మాట్లాడగా వివిధ విభాగాల అధికారులు రామారావు, సుబ్రహ్మణ్యం, శేషరత్నం, రమణ పాల్గొన్నారు.

ఆరు జిల్లాల మహిళా మత్స్యకారులకు శిక్షణ



వంటకాల తయారీని వివరిస్తున్న శిక్షకురాలు

కూసుమంచి: పాలేరులోని పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో మహిళా మత్స్యకారులకు మూడు రోజుల పాటు శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, సూర్యాపేట, హైదరాబాద్, వికారాబాద్ జిల్లాల మహిళా మత్స్యకారులు పాల్గొనగా.. చేప, రొయ్యల పచ్చడి తయారీని శిక్షకులు వివరించారు. సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులునాయక్ మాట్లాడుతూ మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏపీలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ మత్స్య శాస్త్రవేత్త వీరాంజనేయులు చేపలతో తయారుచేసే ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఫిష్ బాల్స్, సమోసా, పాపడ్, కట్‌లెట్, లాలీపాప్స్, బర్గర్ల తయారీతో మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. పాలేరు ప్రధాన శాస్త్రవేత్త శ్యాంప్రసాద్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా వైరస్ విస్తరిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లోనూ కేసు వెలుగు చూసింది. ఈ విషయంలో జరుగుతున్న ప్రచారం, కొత్తరకం వేరియంట్ ప్రమాదకరమైందనే కథనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో కరోనా ఆనవాళ్లు లేకున్నా జాగ్రత్తలు తీసుకోనందున వ్యాప్తి మొదలైతే మాత్రం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మరోపక్క జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా కరోనా పరీక్షలకు కిట్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఒకవేళ వైరస్ వ్యాప్తి మొదలైనా, ఎవరికైనా అనుమానం వచ్చినా నిర్ధారించే పరిస్థితి లేకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

– ఖమ్మంవైద్యవిభాగం

ఏదీ ముందస్తు సన్నద్ధత?



నిరుపయోగంగా మారిన ఆక్సీజన్ కాన్సంట్రేటర్ ప్లాంట్

జిల్లా ప్రజల్లో కరోనా భయం
- అందుబాటులో లేని పరీక్షల కిట్లు
- ఉపయోగంలో లేని ఆక్సిజన్ ప్లాంట్

గుర్తించడం ఎలా?

జిల్లాలో కరోనా వ్యాప్తి చెందితే గుర్తించే పరిస్థితులు లేవు. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు తదితర సమస్యలతో వస్తే సాధారణ పరీక్షలే నిర్వహిస్తున్నారు. కోవిడ్‌ను గుర్తించేందుకు ర్యాపిడ్, ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహించాల్సి ఉన్నా ఏ ఆస్పత్రిలో కూడా కిట్లు అందుబాటులో లేవు. కరోనా వ్యాప్తి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు ఇంత వరకు తీసుకోలేదు. కోవిడ్ సన్నద్ధతపై తమకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడమే ఇందుకు కారణమని చెబుతుండడం గమనార్హం. పరీక్షల కోసం ర్యాపిడ్ కిట్లు 3వేలు కావాలని ప్రతిపాదించినా జిల్లాకు చేరలేదు. ఇక ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహించే పరిస్థితి కూడా లేదు. ఈ పరీక్షలు గతంలో జిల్లా ఆస్పత్రిలో మాత్రమే నిర్వహించగా నివేదిక కచ్చితత్వంతో వస్తుంది. కానీ ఈ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రి లేకపోవడంతో ఇండెంట్ పంపించి వదిలేశారు.

వార్డు ఏర్పాటుతో సరి

కరోనా వ్యాప్తి సూచనలతో అధికారులు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇరవై పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశారు. వార్డు ఏర్పాటు చేసినా కిట్లు లేకపోవడంతో బాధితులను గుర్తించడం ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో కరోనా వ్యాప్తి సమయాన ప్రభుత్వ పరంగా లక్షలాది పరీక్షలు నిర్వహించారు. అప్పట్లో ఆర్‌టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టులు కలిపి 18,64,446 మందికి నిర్వహించారు. అందులో 1,10,395 మందికి కోవిడ్ సోకినట్లు తేలగా, పరిస్థితి విషమించిన 1,447 మంది మృత్యువాత పడ్డారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

తగిన జాగ్రత్తలు పాటించాలి..



ప్రస్తుతం జిల్లాలో కరోనా వ్యాప్తి లేదు. వైరస్ కట్టడికి తీసుకోవాల్సిన సన్నద్ధతపై ఆదేశాలు లేకున్నా పరీక్షల కోసం కిట్లు పంపించాలని కోరాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేనప్పటికీ జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్క్ ధరించడమే కాక తరచూ శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలి. జ్వరం, దగ్గు, జలుబు తదితర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలి.

– బి.కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

నిరుపయోగంగా ప్లాంట్

కరోనా రెండో వేవ్ సమయాన ఆక్సిజన్ కొరత ఏర్పడింది. అప్పుడు గాలి నుండి ఆక్సిజన్ ఉత్పత్తి చేసేలా ప్లాంట్‌ను పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.1.20 కోట్లతో ఏర్పాటుచేసిన కాన్సంట్రేటర్ ప్లాంట్ 2021 మే నెలలో అందుబాటులోకి వచ్చింది. సహజ సిద్ధమైన గాలిని ఒత్తిడికి గురిచేసి నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్ తదితర వాయువులు, ఆక్సిజన్‌ను ఈ ప్లాంట్‌లో వేరు చేస్తారు. గంటకు 2వేల లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ నిర్వహణను కరోనా వ్యాప్తి తగ్గాక పట్టించుకోలేదు. ఆస్పత్రి అవసరాలకు ఉపయోగించుకునే వీలున్నా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు విలువైన ప్లాంట్ తుప్పుపట్టే పరిస్థితికి చేరింది.



పకడ్బందీగా ప్రాధాన్యతా పథకాలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేదికపై మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, పాటిల్, సీపీ సునీల్ దత్ తదితరులు

- ‘ఇందిరమ్మ’ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక
- ఏ ఒక్క అనర్హుడికి ఇల్లు దక్కినా బాధ్యులపై చర్యలు
- ఎరువులు, విత్తనాల కొరత రాకుండా ప్రత్యేక దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, పొంగులేటి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో భట్టితో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ, సాగు ప్రణాళికలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తొలుత ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్ జిల్లాల వారీగా పథకాలు అమలు నివేదికలు వెల్లడించారు.

నకిలీలు అమ్మితే కఠిన చర్యలు

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలోకి నకిలీలు రాకుండా ఏపీ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా, రైతులకు చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అలాగే, భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ఆయన జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సూచనలు చేశారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలను తొలి దశలో అరికట్టడమే కాకుండా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను తనిఖీ చేయాలని, జాబితాలో అర్హుల పేర్లే ఉండేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఆశాజనకంగానే ఉన్నా మరింత పెరగాలని సూచించారు. ఇక రుతుపవనాలు ముందుగా వచ్చినందున సరిపడా ఎరువులు, విత్తనాలు సమకూర్చాలని తెలిపారు.

ఎక్కడా కొరత రావొద్దు

వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందని తెలిపారు. నిల్వలను తరచుగా పరిశీలిస్తూ ఎక్కడా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా చూడాలని సూచించారు.

అనర్హులు ఉంటే అధికారులపై చర్యలు

రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హులు ఉన్నట్లు తేలితే బాధ్యులైన గెజిటెడ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసైన్డ్ భూముల్లో పొజిషన్‌లో ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నందున ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అలాగే, సాదాబైనామా దరఖాస్తుల్లో ప్రభుత్వ భూములు ఉంటే తిరస్కరించాలని తెలిపారు. కాగా, జూన్ 3నుంచి అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని చెప్పారు. కాగా, జూన్ 10 లోపు పైలట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే కాక లబ్ధిదారులకు అవసరమైన ఇసుక టోకెన్ల ద్వారా ఉచితంగా సరఫరా చేయాలని తెలిపారు. అంతేకాక సగంలో మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తిచేయించాలన్నారు.

ఇంకా ఎవరేం అన్నారంటే....

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.
- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ఎదురైన ఇబ్బందులు మరోమారు జరగకుండా ప్రణాళిక రూపొందించాలని కోరారు.
- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గృహలక్ష్మి కింద బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే, ఆస్పత్రుల్లో సరిపడా వైద్యులను కేటాయించాలని సూచించారు.
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించటంతో పాటు వైద్యులను, సిబ్బందిని పెంచాలని తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని.. ఎమ్మెల్యేల సిఫారసులు పరిగణనలోకి తీసుకోకుండా ఇందిరమ్మకమిటీలు, అధికారులు అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.
- ఇంకా సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ బి.రోహిత్ రాజ్, రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళల సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్లు పి.శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్, డీఆర్వో ఏ.పద్మశ్రీ, వివిధ శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల అంతానికి కేంద్రం కుట్ర

- అటవీ సంపదను సంపన్నులకు దోచిపెట్టే ప్రయత్నం
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ బలరామ్‌నాయక్, ఎమ్మెల్యేలు

పాల్వంచరూరల్ : ఆదివాసీ జాతిని అంతం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆదివాసీ సమ్మేళనాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మణిపూర్, అసోం, నాగాలాండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ల్లో ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం పలు ఆపరేషన్ల పేరుతో దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. రాజ్యాంగంలోని ఐదు, ఆరు చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే స్థానిక గిరిజనులతో గ్రామసభలు నిర్వహించి ఆమోదించాక నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా.. అలాంటిదేమీ లేకుండానే మోదీ ప్రభుత్వం ఖరీదైన అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని, ఎదురుతిరిగిన వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అడ్డు తొలగిస్తోందని ఆరోపించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న ఢిల్లీలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు. గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీడీఏలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నాడు రద్దు చేసిన జీఓలను తిరిగి తమ ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని, ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకొస్తామని వివరించారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి..

రాజ్యాంగ పరిరక్షణకు ఆదివాసీలు ఉద్యమించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరామ్ నాయక్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల రద్దుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. గిరిజన చట్టాలు, హక్కులపై అందరికీ అవగాహన ఉండాలని, ఇలాంటి శిక్షణ తరగతుల్లో వాటి గురించి తెలుసుకోవాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సక్రమంగా అమలు చేయకుండా బీజేపీ సొంత ఎజెండా అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివాసీల హక్కులు, సంప్రదాయాల పరిరక్షణకు ఉద్యమించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. కాంగ్రెస్‌తోనే సామాన్యులకున్యాయం జరుగుతుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, గిరిజన హక్కుల సాధనకు ఉద్యమం చేస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ బాబూరావు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ప్రోగ్రామ్ కన్వీనర్ రాహుల్ బాల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.23.42 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈసందర్భంగా 80 రోజులకు గాను రూ.23,42,780 నగదుతో పాటు విదేశీ కరెన్సీ, మిశ్రమ బంగారం, వెండి లభ్యమయ్యాయని ఈఓ రజనీకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి జి.సుదర్శన్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి సువర్ణ పుష్పార్చన..

శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు. వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విపత్తు ఎదురుకాకుండా..

- విత్తన తనిఖీలకు 21టాస్క్‌ఫోర్స్ బృందాలు
- పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులతో ఏర్పాటు
- ఏ ఒక్క రైతు మోసపోకుండా తనిఖీలు, నిఘా



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏఓ పుల్లయ్య, అధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ముందస్తు వర్షాలతో వానాకాలం సాగు పనులు మొదలయ్యాయి. ఈనేపథ్యాన రైతులు అవసరమైన విత్తనాల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఎక్కడా అక్రమాలు జరగకుండా, నకిలీలు మార్కెట్‌లోకి రాకుండా ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈమేరకు వ్యవసాయ, పోలీసు శాఖలతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయగా.. వారు షాపుల్లో తనిఖీలు కూడా చేస్తున్నారు. ఇదే సమయాన రైతులు మోసపోకుండా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

సీజన్ వస్తే చాలు...

వ్యవసాయ సీజన్ మొదలైందంటే చాలు పలుచోట్ల దళారులు రంగప్రవేశం చేస్తారు. ఇతర జిల్లాలకు చెందిన పలువురు రాత్రి వేళ గ్రామాల్లో తిరుగుతూ తమ వద్ద ఉన్న విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని నమ్మిస్తూ రైతులకు అంటగడుతుంటారు. అయితే, వీటికి రశీదు ఇవ్వకపోగా ఎవరు అమ్మారో కూడా గుర్తించలేని పరిస్థితులతో రైతులు నష్టపోవడం ఆనవాయితీగా మారింది. ప్రధానంగా పత్తి, మిర్చి విత్తనాల మోసం తరచూ జరుగుతోంది. ఇక కొందరు లైసెన్స్ కలిగిన వ్యాపారులు సైతం అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తూ జైలు పాలయ్యారు. గత ఏడాది 300మందికి పైగా రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. దీంతో దందాను అరికట్టేందుకు ప్రభుత్వం ముందస్తుగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుకు ఆదేశించింది. నకిలీ, అనుమతులు లేని విత్తనాలతో ఎవరూ నష్టపోకుండా ప్రాథమిక దశ నుంచే తనిఖీల కోసం ఈ బృందాలను నియమించడంతో వారు పని మొదలుపెట్టారు.

మండలానికి ఒక బృందం

జిల్లాలోని 21 మండలాలకు ఒక్కో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని నియమించారు. ఈ బృందానికి మండల వ్యవసాయాధికారి, మండలంలోని పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ నేతృత్వం వహిస్తారు. వీరి సూచనలతో గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తర్ణాధికారులు, ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు విత్తన షాపుల్లో తనిఖీలు చేయనున్నారు.

విత్తన విక్రయాలకు గ్రీన్ సిగ్నల్

వానాకాలం సీజన్ ప్రారంభమవడంతో విత్తనాల విక్రయానికి వ్యవసాయ శాఖ అనుమతించింది. ఇటీవల డీలర్ల సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దిశానిర్దేశం చేశారు. విత్తన విక్రయాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు విత్తనాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది 2.13 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అంచనా వేయగా 6.40 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని చెబుతున్నారు. ఇందులో 4.28 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. 450 గ్రాములు ఒక్కో విత్తన ప్యాకెట్ ధర రూ.901గా నిర్ణయించారు.

విత్తన విక్రయాలపై పటిష్ట నిఘా..

నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా తనిఖీలు చేయిస్తున్నాం. ఎవరైనా విత్తన మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయి. రైతులు కూడా లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి పూర్తి వివరాలతో రశీదు తీసుకోవాలి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి



క్లుప్తంగా

కిష్టారం ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా శ్రీనివాస్



జీఎం చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా కసనబోయిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులను గురువారం జీఎం శాలేంరాజు అందించారు. సింగరేణి గతేడాది ఇంటర్నల్ నోటిఫికేషన్ ద్వారా మేనేజ్‌మెంట్ ట్రెయినీ(వెల్ఫేర్ ఆఫీసర్)లుగా పలువురిని ఎంపిక చేయగా కొందరికే పోస్టింగ్ ఇచ్చింది. మిగతా వారు హైకోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా ఆదేశాలు వచ్చాయి. దీంతో ఐదుగురికి పదోన్నతి కల్పించగా అందులో శ్రీనివాస్ ఉన్నారు. అలాగే, కె.కల్యాణ్ రాజ్‌కుమార్‌ను ఆర్జీఓసీ–2కు, ఏ.మధును అడ్రియాలకు, సిరిమల్లె అశోక్‌ను ఇల్లెందు కేఓసీకి, దాసరి నాగరాజును జీడీకే 2, 2ఏకు కేటాయించారు.

2న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికకు జూన్ 2న పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకల్లా రిపోర్టు చేయాలని సూచించారు.

ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే..



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఏర్పడితే నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తే 11ఏళ్లుగా నిరాశే మిగిలిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి మనోహర్‌రాజు పేర్కొన్నారు. యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఖమ్మంలోని కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించిన మనోహర్‌రాజు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యాన ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వీ.నాగేశ్వరరావు, వెంగళరావు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డితో పాటు విజయ్, పద్మ, ముత్తయ్య, వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, ఉమాదేవి, రాము తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి ఏఎస్పీగా నరేందర్



గోపతి నరేందర్

కొత్తగూడెంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్)గా గోపతి నరేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై అడిషనల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన నరేందర్‌ను పలువురు అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బొగ్గు టిప్పర్ దగ్ధం



దగ్ధమవుతున్న టిప్పర్ కేబిన్

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లి మండలం శాంతినగర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం బొగ్గు టిప్పర్ కేబిన్‌లో మంటలు చెలరేగి దగ్ధమైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి సింగరేణి ఓపెన్‌కాస్టు నుంచి బొగ్గు లోడ్‌తో వచ్చిన టిప్పర్ కొత్తగూడెంలో అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తోంది. ఈక్రమాన టిప్పర్ కేబిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ వాహనం నిలిపేసి దిగాడు. అనంతరం పోలీసులు చేరుకోగా, సత్తుపల్లి నుంచి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

'రియల్' దందా..



అయ్యగారిపేటలో చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్

అనుమతులు లేకుండానే వెంచర్లు

- వ్యవసాయ, అసైన్డ్ భూములను ప్లాట్లుగా చేసి విక్రయం
- కళ్లెదుటే జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

సత్తుపల్లి: మా భూమి మా ఇష్టం.. ప్లాట్లు చేసుకుంటాం.. అమ్ముకుంటాం.. అడిగేదెవరూ అన్నట్టుగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల తీరు కొనసాగుతోంది. జిల్లాలోని సత్తుపల్లి దినదినాభివృద్ధి చెందుతుండడంతో భూములకు మంచి డిమాండ్ వస్తోంది. దీంతో పలువురు పంట భూములు, అసైన్డ్ భూములను అనుమతి లేకుండానే దర్జాగా మట్టి నింపి క్రయ విక్రయాలు చేపడుతున్నారు. రోడ్లు తీసి.. హద్దుల రాళ్లు వేసి మరీ విక్రయిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవటంపై పలు విమర్శలు వస్తున్నాయి. మరికొందరు అలాంటి వెంచర్లలో ఇళ్లు నిర్మించి అమ్మేస్తున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలో ఈ తరహా అక్రమ లేఔట్లతో రియల్ ఎస్టేట్ దందా సాగుతోంది. సత్తుపల్లి, అయ్యగారిపేట రెవెన్యూ పరిధిలోని ఐదు రియల్ ఎస్టేట్ వెంచర్లు, సత్తుపల్లి మండలం గంగారంలోని కృష్ణమందిరం వద్ద, మేడిశెట్టివారిపాలెంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నట్లు సమాచారం.

అనుమతి అవసరమే లేదు..

సత్తుపల్లి పట్టణంలో డీటీసీపీ అనుమతి లేకుండా పదుల సంఖ్యలో రియల్ ఎస్టేట్ వెంచర్లు దర్శనమిస్తున్నాయి. అరెకరం నుంచి ఐదు ఎకరాల వరకు వెంచర్లు వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వ్యవసాయ భూముల్లో రోడ్లు తీసి అందమైన బ్రోచర్లు, మ్యాప్‌లు చూపిస్తూ భూము లు క్రయవిక్రయాలు చేస్తున్నారు. వ్యవసాయ భూముల్లో రోడ్లు తీయటం వల్ల వీటికి అప్రూవల్ లేకపోవటం వల్ల భూమి కాస్తా ఆ యజమాని పేరుమీదనే ఉంటుందని, ఎప్పటికీ రోడ్డు కింద ఉండదని కొందరు వాదిస్తున్నారు. చాలా మంది డీటీసీపీ అప్రూవల్ లేని ప్లాట్లు కొని ఎల్ఆర్ఎస్‌లు కట్టుకుంటూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నాలా కన్వర్షన్‌తో విక్రయం

రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలంటే వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది. చాలాచోట్ల నాలా కన్వర్షన్ చేసేటప్పుడు 5 నుంచి 10 గుంటల వరకు విడివిడిగా బదలాయించి క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. డీటీసీపీ అనుమతి రావాలంటే నిబంధనల ప్రకారం రోడ్లు, పచ్చదనం, మున్సిపాల్టీకి కానీ పంచాయతీకి కానీ 10 శాతం భూమిని బదలాయించాల్సి ఉంటుంది. అదే నాలా కన్వర్షన్ చేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తే ఎలాంటి ఇబ్బందులు రావని అడ్డదారిలో విక్రయాలు జరుపుతున్నారని సమాచారం. అప్రూవల్ తప్పని సరైనా రోడ్లు, విద్యుత్ స్తంభాలు నిర్మించి కాగితాలపైనే చూపిస్తూ ప్లాట్లను అంటగడుతున్నారు.

2020కి ముందు లింక్ డాక్యుమెంట్

భూములు క్రయ విక్రయాలు జరిగేటప్పుడు లింక్ డాక్యుమెంట్ తప్పని సరి అవుతాయి. 2020కి ముందు భూమి గజాల్లో ఉన్నట్లు డాక్యుమెంట్లు ఉంటేనే ప్లాట్లు చేసి అమ్మాల్సి ఉంటుంది. దానికి మాత్రమే ఇంటి పర్మిషన్, బ్యాంకు రుణం వస్తుంది. అలా కాకుండా క్రయ విక్రయాలు జరిగితే ఇంటి అనుమతులకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుంది.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం..



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో డీటీసీపీ అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటుచేస్తే చట్టప్రకారం నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. అలాంటి భూముల వద్ద అనుమతులు లేదని ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తాం. అనుమతి లేని ప్లాట్లు కొంటే ఇబ్బంది ఎదురవుతుందని ప్రజలు గమనించాలి.

–కె.నర్సింహ, మున్సిపల్ కమిషనర్

విద్యుత్ ఫిర్యాదులకు 'చాట్‌బాట్'

- వాట్సాప్ నంబర్ 79016 28348కు ఫిర్యాదు చేస్తే సరి
- స్థితిగతులు తెలుసుకునేలా ట్రాకింగ్



టీజీఎన్పీడీసీఎల్ రూపొందించిన వాట్సాప్ చాట్‌బాట్ విధానం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారంలో మరింత వేగం పెంచడమే కాక వినియోగదారులకు మెరుగైన సేవలందించే లా ఎన్పీడీసీఎల్ (నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) సాంకేతికతను వినియోగించుకుంటోంది. ఇందులో భాగంగానే సమస్యలపై అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా 'వాట్సాప్ చాట్‌బాట్'సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం వాట్సాప్ నంబర్‌ను కేటాయించింది.

ఫిర్యాదు నమోదు ఇలా..

వినియోగదారులు తమ సెల్‌ఫోన్ నుంచి వా ట్సాప్‌లో 79016 28348 నంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే టీజీఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని వస్తుంది. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. ఈ మేరకు రిజిస్టర్ కంప్లైంట్ ఎంచుకుంటే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, విత్‌అవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ అని వస్తుంది. ఆపై విత్ యూనిక్ సర్వీస్ నంబర్ ఎంటర్ చేస్తే వినియోగదారుడి సర్వీస్ వివరాలు వస్తాయి. ఆ వివరాలను సరిపోల్చుకున్నాక ఓకే చేస్తే సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. ఇలా ఏజెంట్‌తో చాట్ చేస్తూ ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు.

ఐడీ నంబర్.. ట్రాకింగ్

వినియోగదారులు చాట్‌బాట్‌లో చేసే ప్రతీ ఫిర్యాదుకు సంస్థ ఒక నంబర్ కేటాయిస్తుంది. అలాగే, సంబంధిత అధికారి వద్దకు ఫిర్యాదు చేరిందని సమాచారం కూడా అందుతుంది. ఆపై వినియోగదారులు ఆ నంబర్ ఆధారంగా సమస్య పరిష్కారం ఏస్థాయిలో ఉందో చాట్‌బాట్‌లో తెలుసుకోవచ్చు. అలాగే, సమస్య పరిష్కరించాక వినియోగదారునికి సమాచారం ఇవ్వడమే కాక ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ చేసి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారు. ఒకవేళ వినియోగదారులు సంతృప్తి చెందకపోతే మరోమారు కంప్లైంట్ రీ ఓపెన్ చేసుకోవచ్చు. అలాగే www.tgnpdcl. com వెబ్‌సైట్‌లో కనిపించే వాట్సాప్ ఐకాన్‌పై క్లిక్ చేసి చాట్ చేయొచ్చు.

మరింత మెరుగైన సేవలకు..



వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించేలా సాంకేతికతను వినియోగించుకుంటున్నాం. ఇందులో భాగంగా మొబైల్ వాట్సాప్ నుంచి సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. ఇదేకాక టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా కూడా సేవలు పొందే అవకాశం ఉంది.

–ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఖమ్మం ఎస్‌ఈ

జీసీసీ గోదాంను పరిశీలించిన చైర్మన్

పాల్వంచరూరల్: పాల్వంచలోని గిరిజన సహకార సంస్థ గోదాంను జీసీసీ చైర్మన్ తిరుపతి గురువారం తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించాక ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు అటవీ ఉత్పత్తులను డిపోలో అమ్మేలా అవగాహన కల్పిస్తూ జీసీసీని లాభాల బాటలో పయనింపజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జీసీసీ డీఎం సమ్మయ్య, బ్రాంచి మేనేజర్లు లక్ష్మీజీ, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



గాంధీచౌక్‌లోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం గాంధీచౌక్‌లోని పలు విత్తన దుకాణాల్లో గురువారం టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేసింది. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న సందర్భంగా రైతులు విత్తనాల విక్రయానికి ముందుకొస్తున్నారు. ఈమేరకు నకిలీలు మార్కెట్‌లోకి రాకుండా వ్యవసాయ, పోలీసు శాఖలతో కూడిన టాస్క్‌ఫోర్సు బృందాలు రంగంలోకి దిగాయి. ఖమ్మం గాంధీచౌక్ కేంద్రంగా పెద్ద సంఖ్యలో విత్తన దుకాణాలు ఉండగా, ఖమ్మంతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు వస్తుంటారు. దీంతో ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఖమ్మం అర్బన్ ఏఓ బలుసు కిషోర్‌బాబు, ఖమ్మం త్రీటౌన్ సీఐ జె.మోహన్‌బాబుతో కూడిన బృందం గురువారం పలు షాపుల్లో తనిఖీ చేసింది. పత్తి విత్తన ప్యాకెట్ల లభ్యత, లాట్ నంబర్లు, తయారీ, గడువు తేదీలను పరిశీలించారు. అలాగే, అనుమతి లేని బీటీ–3 విత్తన విక్రయాలు జరుగుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, నిర్దేశించిన విధంగా రికార్డులను నిర్వహించాలని డీలరలకు సూచించారు.

తెలంగాణ ఉద్యమకారుడు ఆశీర్వాదం మృతి



ఆశీర్వాదం (ఫైల్)



ఆశీర్వాదం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ: తల్లాడ మండలం పినపాకకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మోదుగు ఆశీర్వాదం(69) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. యాభై ఏళ్ల క్రితం కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. కొన్నాళ్లు కాంగ్రెస్‌లో కొనసాగగా, 2001లో టీఆర్ఎస్‌లో చేరి మలిదశ ఉద్యమంలో చురుగ్గా వ్యవహరించారు. బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గానూ పనిచేసిన ఆశీర్వాదం తల్లాడలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా, ఆశీర్వాదం మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. అలాగే, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్‌తో పాటు వజ్రాల రామిరెడ్డి, కోడూరి వీరకృష్ణ, బద్దం కోటిరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, కాంపాటి జమలయ్య, జీవీఆర్, వివిధ పార్టీల నాయకులు సైతం నివాళులర్పించి ఆశీర్వాదం కుటుంబీకులను పరామర్శించారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల విద్యాలయంలో 1, 2, 5వ తరగతుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యాసంవత్సరానికి పినపాక మినీ గురుకులంలో ఒకటో తరగతిలో 30, రెండో తరగతిలో ఒకటి, ఐదో తరగతిలో ఎనిమిది సీట్ల భర్తీకి అర్హత కల్గిన స్థానిక గిరిజన విద్యార్థినులు జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక విద్యార్థులు లేకుంటే సమీప మండలాల వారికి అవకాశం ఇస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డ్ తదితర పత్రాలు జత చేయాలని, లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామని తెలిపారు. 1 – 5వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారని పీఓ వెల్లడించారు. పూర్తి వివరాలకు 97014 95907, 77026 52708 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ సదస్సుకు భద్రాద్రి అధికారి

కొత్తగూడెంఅర్బన్: ఢిల్లీలో యూనిసెఫ్ సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వి.మధువరణ్ హాజరయ్యారు. మానవ ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాలు, దేశంలో వాతావరణ అనుకూలత కోసం ఆవిష్కరణలు, పరస్పర అధ్యయనాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా దేశంలోని పలువురు ప్రముఖులు, వైద్యారోగ్య శాఖ నిపుణులు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లా నుంచి హాజరైన మధువరణ్ కూడా పలు సూచనలు చేశారు.

అర్హులందరికీ సంక్షేమమే లక్ష్యం



ఇందిరా డెయిరీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- రూ.9.49కోట్ల విలువైన రోడ్ల పనులకు శంకుస్థాపన

బోనకల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. బోనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. గార్లపాగు నుంచి రామాపురం మీదుగా చింతకాని మండలం నాగులవంచ వరకు రూ.2.23కోట్లతో చేపట్టే రోడ్డు మరమ్మతు పనులు, చిన్నబీరవల్లి నుండి నారాయణపురం వరకు రూ.4.50కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు మరమ్మతుతో పాటు బోనకల్ ఇందిరా డైరీ నుంచి రావినూతల వరకు రూ.2.76కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశాక డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఉద్యోగాల భర్తీ ద్వారా నిరుద్యోగులకు న్యాయం చేస్తూనే, స్వయం ఉపాధి పథకాల కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభిస్తున్నారని తెలిపారు. కాగా, వర్షాలు మొదలైనందున రైతులకు కావాల్సిన విత్తనాలను సమకూరుస్తున్నామని చెప్పారు. అయితే, నకిలీ విత్తనాల విషయంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, ఎస్ఈ గుర్రాల వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ మహేష్‌బాబు, డీఈ కోటేశ్వరావు, ఏఈఈ నవీన్‌కుమార్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ రమాదేవి, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు పైడిపల్లి కిశోర్, గాలి దుర్గారావు, పిల్లలమర్రి నాగేశ్వరావు, బోయినపల్లి వెంకటేశ్వర్లు, మోదుగు సుధీర్‌బాబు, ఎర్రంశెట్టి సుబ్బారావు, మరీదు శ్రీను, గత్తం బాలరాజు, చేబ్రోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలే అంబాసిడర్లు..

మహిళా మార్ట్‌ను సందర్శించిన ఉమ్మడి జిల్లా అధికారులు



మార్ట్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్లు, సీపీ, ఎస్పీ డీఎఫ్ఓ



క్యాంటీన్ వద్ద టీ తాగుతున్న కలెక్టర్లు, సీపీ, ఎస్పీ, డీఎఫ్ఓ

ఖమ్మంమయూరిసెంటర్: 'మా వంతుగా మార్ట్ ఏర్పాటు చేసి ప్రచారం కల్పిస్తున్నాం.. మీరు తయారు చేసిన ఉత్పత్తులకు మీరే అంబాసిడర్లుగా విక్రయించుకోవడం, లాభాలు వచ్చేలా ముందుకు సాగే బాధ్యత మీదే' అని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. ఖమ్మం వైరా రోడ్డులో ఏర్పాటుచేసిన మహిళా మార్ట్‌ను భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఖమ్మం సీపీ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్, ఖమ్మం జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ గురువారం సందర్శించారు. మార్ట్ ఏర్పాటుకు దారి తీసిన అంశాలను కలెక్టర్ వారికి వివరించాక మహిళా సంఘాల సభ్యులు రూపొందించిన వస్తువులను అధికారులు ఆసక్తిగా పరిశీలించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా అధికారులు మార్ట్‌లో పలు వస్తువులు కొనుగోలు చేశారు.

టీ బాగుంది.. నేనే పే చేస్తా..

మార్ట్‌ను సందర్శించాక ఆవరణలో ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను వద్దకు అధికారులంతా వచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మం సీపీ సునీల్‌దత్ అందరినీ టీ తాగాలని కోరారు. ఆపై టీ బాగుందని నిర్వాహకురాలిని అభినందించిన ఆయన తన ఫోన్‌లో యాప్ ద్వారా డబ్బు చెల్లించారు.

పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న టీజీవోస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ కోరారు. పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచార జాతాను ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో టీజీవోస్ కార్యదర్శి మోదుగు వేలాద్రి, నాయకులతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యతో పాటు పౌష్టికాహారం, యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందుతాయని తెలిపారు. ఈనేపథ్యాన తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు బుర్రి వెంకన్న, షరీఫ్, శ్రీనివాస్, శ్యాంకుమార్, రోజా, నర్సింహారావు, సాంబమూర్తి, రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దూడలతో ఎస్ఐ

తిరుమలాయపాలెం: అనుమతి లేకుండా రవాణా చేస్తున్న పశువులు, వ్యాన్‌ను తిరుమలాయపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆవు దూడలను ట్రాలీ ఆటోలో తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం అర్ధరాత్రి పాతర్లపాడు సమీపాన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వ్యాన్ డ్రైవర్ నరేష్, వ్యాపారులు మాదాసు వెంకన్న, బత్తుల నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.జగదీష్ తెలిపారు. కాగా, స్వాధీనం చేసుకున్న ఆవుదూడలను గురువారం గొల్లగూడెంలోని గోశాలకు తరలించామని వెల్లడించారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మధిర: మధిర మండలం సిరిపురం పాత టోల్ గేట్ వద్ద టిప్పర్లను మల్లారం, రొంపిమల్ల గ్రామస్తులు గురువారం అడ్డుకుని నిరసన తెలిపారు. హైవే నిర్మాణానికి సామగ్రి తీసుకెళ్లే టిప్పర్ల రాకపోకలతో సిరిపురం – నెమలి రోడ్డుపై గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లారం మాజీ సర్పంచ్ ఉపేంద్ర, కొంగర రంగయ్యతో పాటు మల్లారం, రొంపిమల గ్రామస్తులు పలువురు ల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

పాల్వంచ/మణుగూరు రూరల్: ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలను నిరసిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయీస్(టీజీపీఈ) జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాల్వంచలోని కేటీపీఎస్, మణుగూరులోని బీటీపీఎస్‌ల ఎదుట గురువారం భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న నాయకులపై కేసులు బనాయిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని, ఉత్తరప్రదేశ్ కార్మికులకు అందరూ అండగా నిలవాలని పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ అసిస్టెంట్ ఇంజనీర్ల అసోసియేషన్ నాయకులు రవిప్రసాద్, రవితేజ, బ్రహ్మాజీ, యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.